బహుభాషా కోవిదుడు మహాదేవ శాస్త్రి

ఆచార్య కోరాడ మహదేవ శాస్త్రి కుటుంబ వారసత్వంగా సాహిత్యంపై ఆసక్తిని పుణికిపుచ్చుకుని బహు భాషా శాస్త్రవేత్తగా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. మచిలీపట్నంలో 29-12-1921లో కోరాడ రామకృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులకు జన్మించిన ఈయన చిన్నతనం నుంచే తెలుగు, సంస్కృత భాషల్లో పట్టు సాధించారు. బందరులోని హిందూ హైస్కూలు, మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజీలో ఉత్తమ విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకున్నారు. పారిశ్రామిక కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేసే సమితి (సిమ్లా)లో 1944-46 వరకు పనిచేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్‌లో రీసెర్చ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ "ఇండస్ట్రియల్ ప్రాఫిట్స్ ఇన్ ఇండియా" గ్రంథాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు కె.ఎం. మున్షీతో కలిసి ప్రచురించారు. 1948లో దర్భంగాలో అఖిల భారత ప్రాచ్య పరిషత్ సభల్లో తండ్రి రామకృష్ణయ్యగారితో పాటు పాల్గొన్నారు. ఆ సందర్భంగా ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త ఆచార్య సునీల్‌కుమార్ ఛటర్జీతో మహదేవ శాస్త్రిగారికి పరిచయం జరిగింది. కోల్‌కత విశ్వవిద్యాలయంలో తులనాత్మక భాషాధ్యయన శాఖాధిపతి సునీల్‌కుమార్ ఛటర్జీతో పరిచయం శాస్త్రిగారి జీవితంలో గొప్ప మలుపు. ఛటర్జీ రచించిన ప్రసిద్ధ గ్రంథం 'ఆరిజన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ బెంగాలీ లాంగ్వేజి' చదివి తన ఆసక్తిని వివరించారు. దీంతో 'హిస్టారికల్ గ్రామర్ ఆఫ్ తెలుగు' అన్న అంశంపై పరిశోధన చేయాలని శాస్త్రిగారికి ఛటర్జీ సూచించారు. నాలుగేళ్ళు పరిశోధన చేసి 'హిస్టారికల్ గ్రామర్ ఆఫ్ తెలుగు' అన్న సిద్ధాంత గ్రంథాన్ని 1959లో కోల్‌కత విశ్వవిద్యాలయానికి సమర్పించారు. 1969లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రచురించిన ఈ గ్రంథం శాస్త్రిగారికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చింది. వారణాసి పరిసరాల్లోని జాన్‌పూర్, సోనేపర్ తదితర గ్రామాల ప్రజల స్థితిగతులను, అక్కడి మాండలికాలను అధ్యయనం చేసి 'ఏ గ్రామర్ ఆఫ్ వెస్టర్న్ భోజ్‌పురి' గ్రంథాన్ని రచించారు. 1957లో అన్నామలై విశ్వవిద్యాలయంలోని లింగ్విస్టిక్స్ శాఖలో అధ్యాపకుడిగా, 1960లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశారు. 1964లో తిరువనంతపురం విశ్వవిద్యాలయంలో 'ద్రవిడియన్ లింగ్విస్టిక్ అసోసియేషన్'ను ప్రారంభించారు. జర్మనీలోని కొలోన్ విశ్వవిద్యాలయానికి చెందిన కె.ఎల్.బానర్ట్ ఆహ్వానంపై 1976-78 మధ్య అక్కడి విద్యార్థులకు మహదేవ శాస్త్రి తెలుగు నేర్పారు. బానర్ట్ కోరికపై 'డిస్క్రిప్టివ్ గ్రామర్ అండ్ హ్యాండ్ బుక్ ఆఫ్ మోడర్న్ తెలుగు' పుస్తకాన్ని రచించారు. 1981లో ఉద్యోగ విరమణ చేసిన అనంతరం 'తెలుగు వాఙ్మయం పరిచయం' గ్రంథం రచించారు. 30 ఏళ్లపాటు తెలుగు భాషా అధ్యయన బోధనలో విశేష కృషిచేసి, ఎందరికో మార్గనిర్దేశకులుగా నిలిచారు. ఇంగ్లీషులో 20కి పైగా అమూల్య పరిశోధన పత్రాలను సమర్పించారు. తెలుగు భాషా శాస్త్ర భీష్మాచార్యులుగా పేరొందిన మహదేవశాస్త్రిగారికి సి.పి.బ్రౌన్ అకాడమీ(హైదరాబాద్) 'తెలుగు భారతి' పురస్కారం ప్రకటించడం ఆనందదాయకం.



ఆచార్య కోరాడ మహదేవ శాస్త్రి గారికి సిపి బ్రౌన్ అకాడమీ 'తెలుగు భారతి' పురస్కారాన్ని ప్రకటించిన సందర్భంగా..

డా. జొన్నలగడ్డ హనుమచ్ఛాస్త్రి, 08562-243923